మన బలగం

సామాన్యుడి ఆయుధం

తెలుగు దినపత్రిక

07-12-2024 శనివారం పేజీలు 4 www.manabalagam.com





## హైవేపై ప్రమాదకరంగా గోతి

**జగిత్యాల, డిసెంబర్ 6 (మన బలగం):** నిజామాబాద్ టూ జగదల్పూర్ నేషనల్ హైవేపై నిర్లక్ష్యం పెరుగుతోంది. ఏడాది కాలంగా హైవేపై గోతి పడినా సంబంధించిన అధికారులు పట్టించుకోని వైనమిది. జగదల్ పూర్ నేషనల్ హైవే నిజామాబాద్ నుంచి మొదలై జగిత్యాల మీదుగా లక్షెట్టిపేట మీదుగా జగదల్ పూర్ చేరుకొంటుంది. ఈ రహదారిలో జగిత్యాల రూరల్ మండలం గోపాల్ రావు పేట ఉండగా పెంబట్ల గ్రామానికి వెళ్లే కమాన్ కు సమీపంలోనే ప్రధాన రోడ్డుపై గోతి ఏర్పడింది. గతంలో ఈ రోడ్డు

మిగతా 2 లో

## అట్రాసిటీ కేసుల పరిష్కారానికి చర్యలు

- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- కోర్టుల్లో ఆధారాలు సమర్పించి నిందితులకు శిక్ష పడే విధంగా కృషి
- పెండింగ్ కేసుల స్థితిగతులపై వారం రోజుల్లో నివేదిక అందించాలి
- జిల్లా స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్




**మనబలగం, రాజన్న సిరిసిల్ల ప్రతినిధి:** ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు వేగవంతంగా పరిష్కారమయ్యేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఎస్పీ అఖిల్ మహజన్ తో కలిసి శుక్రవారం కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నియంత్రణపై జిల్లా స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఎస్సీ, ఎస్టీలకు అమలు చేస్తున్న పథకాలు, అట్రాసిటీ కేసుల వివరాల ప్రస్తుత స్థితి గతులపై సంబంధిత అధికారులతో సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

మిగతా 3 లో



# భావి సైంటిస్టులు భళా

- వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల్లో నైపుణ్యాలు మెరుగు
- నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, డిసెంబర్ 6 (మన బలగం):** వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల నైపుణ్యాలు మెరుగుపడతాయని కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. శుక్రవారం స్థానిక సెయింట్ థామస్ పాఠశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఇన్ స్పైయిర్, విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను కలెక్టర్, అధికారులు, అతిథులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ముందుగా మామడ మండలం పొన్కల్ ప్రభుత్వ పాఠశాల ఎన్ సీసీ విద్యార్థుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వం, కొత్త విషయాలు నేర్చుకోవాలన్న కుతూహలం, శోధన, పరిశీలన వంటివి పెంపొందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమం రెండు రోజులపాటు కొనసాగుతుందని విద్యార్థులకు ఆచరణాత్మక విద్యను అందించడం ద్వారా సొంతంగా ఇటువంటి వైజ్ఞానిక ఆవిష్కరణలు తయారు


మిగతా 2 లో



## జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు ప్రారంభం

హాజరైన వేములవాడ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

..2 లో



## కరీంనగర్ డెయిరీలో మిల్క్ కేకులకు ఫంగస్

- ఫుడ్ ఇన్ స్పెక్టర్ తనిఖీల్లో బహిర్గతం
- సీజ్ చేసిన అధికారులు

..2 లో

శనివారం,
07-12-2024
MANA BALAGAM
మన బలగం
సామాన్యుడి ఆయుధం
తెలుగు దినపత్రిక

# హైవేపై ప్రమాదకరంగా గోతి



**మొదటి పేజీ తరువాయి**

మధ్యలో నుంచి మురికి నీరు మరోవైపు మళ్లించేందుకు ఒక పెద్ద పైపు వేసినట్లు తెలిసింది. ఈ పైపు ఒక వైపు పగిలిపోగా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో తాత్కాలిక మరమ్మతులు చేసినట్లు స్థానికులు తెలిపారు. కానీ వాహనాల రాక పోకలతో ఆ మరమ్మతు పనులు పనికి రాకుండా పోయినట్లు తెలిసింది. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులకు గుంత కనిపించక ప్రమాదాలబారిన పడ్డ సంఘటనలు ఉన్నాయి. దీంతో రాత్రి వేళల్లో వాహనదారులకు ఎదురవుతున్న ఇబ్బందులను గుర్తించిన స్థానికులు కొన్ని రోజులపాటు చెట్ల కొమ్మలను ఆ గోతిలో పాతి వాహనదారులను అప్రమత్తం చేసారు. కానీ ఆర్ అండ్ బీ అధికారులు, గ్రామీణ పి.ఆర్ విభాగం అధికారులు ఈ సమస్యపై దృష్టి సారించకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయందోళనల్లో స్థానికులు ఉంటున్నారు. ప్రధానంగా మూల మలుపులో ఈ గోతి ఏర్పడడంతో అక్కడికి వచ్చే వరకు గుర్తించే పరిస్థితులు లేవని స్థానికులు అంటున్నారు. భూ సర్వేల సమయాల్లో తప్ప ఆ శాఖ అధికారులు కనిపించరని స్థానికులు అంటున్నారు. నిత్యం ఈ రహదారిలో వెళ్లే ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, కలెక్టర్ ఇతర అధికారులకు ఈ సమస్య కనిపించడం లేదా అని ఆ ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. జగిత్యాల ట్రాఫిక్ పోలీస్ నియంత్రికతో తాత్కాలికంగా ప్రమాదాలకు అవకాశం తగ్గినా రానున్న రోజుల్లో జరిగే జాతరల వంటి వేడుకల నేపథ్యంలో ఈ గోతికి శాశ్వత పరిష్కారం చూపాలని, ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## కరీంనగర్

# డెయిరీలో మిల్క్ కేకులకు ఫంగస్



జగిత్యాల, డిసెంబర్ 6 (మన బలగం): జగిత్యాలలోని కలెక్టరేట్ సమీపంలో ఉన్న కరీంనగర్ డెయిరీ సెంటర్‌పై ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనూష శుక్రవారం దాడి చేశారు. ఈ దాడిలో కాలం చెల్లి ఫంగస్ చేరిన కేకులను సీజ్ చేశారు. అనంతరం మీడియాతో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనూష మాట్లాడారు. ఈ నెల 3న షకీల్ అనే వినియోగదారుడు ఇక్కడ మిల్క్ కేకు కొనుగొలు చేసి ఇంటికి వెళ్లి చుడగా అందులో ఫంగస్ చేరిన విషయాన్ని గుర్తించాడని తెలిపారు. తిరిగి కొన్న చోటుకే వచ్చి ఇదేమని అడిగితే నిర్లక్షపు సమాధానం ఇచ్చారని షకీల్ చెప్పాడని పేర్కొన్నారు. తిరిగి తమ కార్యాలయానికి వచ్చి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆకస్మికంగా దాడి చేయగా షకీల్ కొనుగోలు చేసిన మిల్క్ కేకుల బ్యాచ్ స్టాక్ మొత్తాన్ని సీజ్ చేశామని అన్నారు. కరీంనగర్ మిల్క్ డెయిరీకి మిగతా 7 సెంటర్లలో ఈ బ్యాచ్ మిల్క్ కేకులను విక్రయించరాదని ఆదేశాలు ఇచ్చామని, వినియోగదారులకు ఎలాంటి నష్టం జరిగినా తమ ఆఫీసుకు వచ్చి ఫిర్యాదు చేయాలని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనూష కోరారు.

# భావి సైంటిస్టులు భళా

**మొదటి పేజీ తరువాయి**

చేయగలుగుతారని అన్నారు. విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేసేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు. ఈ సైన్స్ ఎగ్జిబిషన్ కార్యక్రమంలో జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల నుంచి దాదాపు 800 మంది విద్యార్థులు తమ ప్రదర్శనలను ఏర్పాటు చేశారని తెలిపారు. చేసిన విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఈ వైజ్ఞానిక ప్రదర్శనల నుంచి ఎక్కువ సంఖ్యలో రాష్ట్ర స్థాయిలోకి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. అంతకుముందు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అతిథులను అలరించాయి. అనంతరం ఎన్ సిసి అధికారులకు కలెక్టర్ బహుమతులను అందజేశారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులచే ఏర్పాటు చేయబడిన వైజ్ఞానిక ప్రదర్శనలను కలెక్టర్, అతిథులు తిలకించారు. విద్యార్థులందరిని వారు తయారు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనల గురించి సమాచారాన్ని అడిగి రాబట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులందరినీ కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి పి.రామారావు, గ్రంథాలయ చైర్మన్ అర్జుమన్ అలి, తహసిల్దార్ రాజు, ఏసీజీఈ పద్మ, ఎస్‌వో సలోమి కరుణ, విద్యాశాఖ అధికారులు, వివిధ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

**బాలశక్తిని పకడ్బందీగా కొనసాగించాలి**

నిర్మల్, డిసెంబర్ 6 (మన బలగం): బాలశక్తి కార్యక్రమాన్ని నిరంతరం పకడ్బందీగా కొనసాగించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బాలశక్తి కార్యక్రమంపై సంబంధిత అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బాలశక్తి కార్యక్రమంలో భాగంగా



ప్రభుత్వ విద్యాసంస్థల్లోని విద్యార్థులకు ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి, అన్ని రకాల పరీక్షలను నిర్వహించాలన్నారు. విద్యార్థుల్లో వ్యాధులను గుర్తించినట్లయితే వాటికి సంబంధించి మందులను సిఫారసు చేయాలని అన్నారు. వ్యాధులను నిర్ధారించడమే కాకుండా, నివారణకు కోసం మందులు, పోషకాలను తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థికి ఆరోగ్య కార్డులను తయారుచేసి, తల్లిదండ్రులకు వారి ఆరోగ్య స్థితిగతులను వివరించాలన్నారు. ఇప్పటివరకు విద్యార్థులకు నిర్వహించిన రోగ నిర్ధారణ పరీక్షలు, అందించిన పోషకాలు, మందుల గురించి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఆర్థిక అక్షరాస్యత మెరుగుపరిచేందుకుగాను బ్యాంకు అధికారులు క్షేత్రస్థాయిలో దశల వారీగా విద్యార్థులకు రోజువారి బ్యాంకు లావాదేవీలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించు రుణాలు, సైబర్ నేరాలపై పరిజ్ఞానం పట్ల అవగాహన కల్పించాలని తెలిపారు. అన్ని పాఠశాలలో విద్యార్థులకు రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, భారత ఎన్నికల విధానం వంటి విషయాలపై అవగాహన కల్పించేలా వ్యాసరచన పోటీలను నిర్వహించాలని తెలిపారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులచే నమూనా పార్లమెంటు సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి విద్యార్థికి కంప్యూటర్ పరిజ్ఞానం పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. బాలశక్తి కార్యక్రమాన్ని విజయవంతంగా కొనసాగించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అధనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డిఈఓ పి. రామారావు, డిఎంహెచ్ఓ రాజేందర్, డిఆర్డిఓ విజయలక్ష్మి , లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్, విద్య, వైద్యారోగ్య, శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

**వీధి వ్యాపారులు ట్రాఫిక్ కు ఇబ్బందులు కలిగించొద్దు**

నిర్మల్, డిసెంబర్ 6 (మన బలగం): పట్టణంలో వీధి వ్యాపారులు తమకు కేటాయించిన ప్రదేశాలలో మాత్రమే తమ వ్యాపారాన్ని నిర్వహించుకునే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం మున్సిపల్ శాఖ అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కూరగాయలు పండ్లు, పూలు ఇతర వీధి వ్యాపారస్తులు నిర్దేశించిన ప్రదేశాలలో మాత్రమే తమ వ్యాపారాన్ని చేసుకోవాలని తెలిపారు. ప్రజలకు ఇబ్బంది కలిగే విధంగా రోడ్లపై వ్యాపారాన్ని నిర్వహించరాదన్నారు. పట్టణంలో పార్కింగ్ సమస్య అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించాలని, పార్కింగ్ నియంత్రణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. షాపింగ్ మాల్, ఇతర వ్యాపార సముదాయాలలో పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సామాన్య ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్‌ను నియంత్రించాలన్నారు. వెజ్, నాన్‌వెజ్ వ్యాపారులు నిర్దేశించిన ప్రదేశాలలో మాత్రమే తమ వ్యాపారాలు చేసుకోవాలని తెలిపారు. చేపల మార్కెట్‌లో అన్ని రకాల సౌకర్యాలు కల్పించి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, మెప్మా పీడీ సుభాష్, లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు ప్రారంభం

మనబలగం, రాజన్న సిరిసిల్ల ప్రతినిధి: జిల్లాస్థాయి ఇన్‌స్పైయిర్, విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు వేములవాడ ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం ప్రారంభం అయ్యాయి. ఉదయం 10:30కు వేములవాడ శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ జిల్లాస్థాయి ఇన్‌స్పైయిర్, విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభించారు. ఈ వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు 68 ఇన్‌స్పైయిర్ ప్రాజెక్టులు, 400కు పైగా నమూనా ప్రదర్శనలు ప్రదర్శించారు. జిల్లావ్యాప్తంగా 13 మండలాల నుంచి దాదాపు 800లకు పైగా విద్యార్థులు, 250 మందికి పైగా టీచర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ అత్యంత తెలివైన అద్భుతమైన ప్రాజెక్టులను తీసుకురావడం అభినందనీయం అన్నారు. గతంలోనూ ఇలాంటి ప్రదర్శనల నుంచే రాష్ట్రస్థాయిలోనే కాకుండా జాతీయస్థాయిలో రాజన్న సిరిసిల్ల జిల్లాకు మంచి గుర్తింపు తీసుకువచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అదే స్ఫూర్తితో ప్రస్తుతం పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులు తమ ప్రదర్శనలను రాష్ట్ర, జాతీయస్థాయిలో మంచి గుర్తింపు తీసుకురావాలని కోరారు. జిల్లా విద్యాశాఖ కోరిక మేరకు సైన్స్ మ్యూజియం ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ



సందర్భంగా జిల్లా విద్యాధికారి బి.జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ 400కు పైగా నమూనా ప్రాజెక్టులు తీసుకురావడం ఇన్‌స్పైయిర్‌లో 68 ప్రాజెక్టులు తీసుకురావడంలో విద్యార్థుల కృషితో పాటు ఉపాధ్యాయుల ప్రోత్సాహం అభినందనీయమని ఉపాధ్యాయులను కొనియాడారు. జిల్లా సైన్స్ అధికారి పాముల దేవయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమష్టి కృషితో మొదటి రోజు వచ్చిన విద్యార్థులకు ఉపాధ్యాయులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మధ్యాహ్న భోజనంతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించామని పేర్కొన్నారు. శనివారం ఈ ప్రదర్శన కొనసాగుతుందని, ఆసక్తి గల విద్యార్థులు ఈ ప్రదర్శనను శనివారం మధ్యాహ్నం లోపు వీక్షించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వేములవాడ మునిసిపాలిటీ వైస్ చైర్మన్ బింగి మహేశ్, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేశ్, డైరెక్టర్ దైత కుమార్, ఖమ్మం గణేష్, మాజీ కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు అన్నారం శ్రీనివాస్, పులి రాంబాబు, సాగరం వెంకటస్వామి, పుల్కం రాజు, కొక్కుల రాజు, అన్ని మండలాల విద్యాధికారులు, అన్ని ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు, ఉపాధ్యాయులు విద్యార్థినీ విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# మాలల ఐక్యవేదిక ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతి



ధర్మారం, డిసెంబర్ 6 (మన బలగం): ధర్మారంలో అంబేద్కర్ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర మాలల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు బొల్లం మల్లేశం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. మల్లేశం, జిల్లా అధ్యక్షులు సురమల్ల సతీశ్ మాట్లాడుతూ అంబేద్కర్ అందరివాడని కొనియాడారు. సామాజిక తరగతుల అభ్యున్నతికి కృషి చేశాడని తెలిపారు. భారత సమాజాన్ని పట్టి పీడిస్తున్న మను వాదాన్ని తగలబెట్టాలని, మనువాదం నుంచి విముక్తి పొందడమే మార్గమని తెలిపాడని చెప్పారు. రాష్ట్ర కార్యదర్శి గుమ్మడి శ్రీనివాస్, గంధం నారాయణ, మాజీ సర్పంచ్ దేవి రాజయ్య అంబేద్కర్‌కు నివాళులర్పించారు.

# అంబేద్కర్ ఆశయాల కోసం కృషిచేయాలి



ఇబ్రహీపట్నం, డిసెంబర్ 6 (మన బలగం): అంబేద్కర్ ఆశయాల కోసం కృషిచేయాలని జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం తహసీల్దార్ ప్రసాద్ అన్నారు. శుక్రవారం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తహీల్దార్ మాట్లాడుతూ వివక్షకు వ్యతిరేకంగా తన జీవితకాలం పోరాడిన అంబేద్కర్ అజరామర కీర్తిని గుర్తుచేశారు. కార్యక్రమంలో పలు గ్రామాల ప్రజాప్రతినిధులు, ఎంపీడీవో సాంబరి చంద్రశేఖర్, పలు సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గర్భిణులకు హెచ్ ఐవీపై అవగాహన



నిర్మల్, డిసెంబర్ 6 (మన బలగం): నిర్మల్ జిల్లా కేంద్రంలోని మాతా శిశు సంరక్షణ ఆసుపత్రిలో శుక్రవారం గర్భిణులకు హెచ్ఐవీ పరీక్షల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. వ్యాధి సోకే మార్గాలు, నివారణ చర్యలపై సూచనలు చేశారు. నవజాత శిశువులకు హెచ్ఐవీ సోకకుండా తీసుకుంటున్న చర్యలపై వివరించారు. కార్యక్రమంలో ఎంసీహెచ్ ఐసీటీసీ కౌన్సిలర్ ఎల్లేశ్, డీఎస్ఆర్సీ కౌన్సిలర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# అట్రాసిటీ కేసుల పరిష్కారానికి చర్యలు

**మొదటి పేజీ తరువాయి**

మాట్లాడుతూ, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్ ట్రైబ్ శాఖల పరిధిలోని హాస్టల్స్, రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం, అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్షిప్, బెస్ట్ అవైలబుల్ స్కీమ్, స్టడీ సర్కిల్, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ వంటి పథకాలను పకడ్బందీగా అమలు చేస్తున్నామని అన్నారు. ఎస్సీ కార్పొరేషన్ పరిధిలో పాడి పశువుల యూనిట్ల గ్రౌండింగ్ కు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. జిల్లాలో నవంబర్ 30 నాటికి పెండింగ్ ఉన్న మొత్తం 30 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదయ్యాయని, వీటిపై కేసుల వారిగా వారం రోజుల్లో నివేదిక అందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. 2016 నుంచి ఇప్పటివరకు సిరిసిల్ల జిల్లాలో మొత్తం 8 మర్డర్లు, 4 రేప్ కేసులు, 486 అట్రాసిటీ మొత్తం 498 ఎస్సీ, ఎస్టీ కేసుల ఫిర్యాదులు రాగా 5 కోట్ల 64 లక్షల 11 వేల 250 రూపాయల పరిహారం మంజూరు చేశామని, మరో కోటి రూపాయల 76 లక్షల 37 వేల 500 పరిహారం ఇచ్చేందుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి సమర్పించామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఎస్సీ ఎస్టీ కేసులకు సంబంధించి కోర్టులలో సంబంధిత నేరస్తులకు శిక్ష పడే విధంగా ఆధారాలను సమర్పించాలని, ఎస్సీ ఎస్టీలకు న్యాయం జరిగే విధంగా అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రత్యేక శ్రద్ధ పెట్టి పని చేయాలని కలెక్టర్ కోరారు. అట్రాసిటీ కేసులపై విస్తృత స్థాయిలో ప్రచారం కల్పించాలని అన్నారు. పోలీస్ స్టేషన్లలో తప్పనిసరిగా చట్టం ప్రకారం కేసులు నమోదు చేయాలని అన్నారు. అనంతరం జిల్లా స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుల అభిప్రాయాలను తెలుసుకున్న కలెక్టర్, వారికి ఉన్న సందేహాలను నివృత్తి చేస్తూ, వారు అందించిన సూచనలు పాటించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. సమావేశంలో రెవెన్యూ డివిజన్ అధికారులు వెంకట ఉపేందర్ రెడ్డి, రాజేశ్వర్, సెషన్స్ కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాములు, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి విజయ లక్ష్మి, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ స్వప్న, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కొమ్ము బాలయ్య, అజ్మీర తిరుపతి, మెట్ట దేవానంద్, కొత్తపల్లి సుధాకర్, పాసుల బాలరాజ్, ఎన్జీవో సభ్యులు ఆలువల ఈశ్వర్, డప్పుల అశోక్, సిరిగిరి రామచందర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# అంబేద్కర్ కు నివాళులర్పించిన కలెక్టర్, ఎస్పీ

మనబలగం, రాజన్న సిరిసిల్ల ప్రతినిధి: భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ వర్ధంతిని శుక్రవారం సిరిసిల్లలో నిర్వహించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో అంబేద్కర్ చిత్రపటానికి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ పూల మాలలు వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడారు. భారత స్వాతంత్ర్య పోరాటం, రాజ్యాంగ నిర్మాణంలో అంబేద్కర్ సేవలను కొనియాడారు. ఆయన భారత మొట్ట మొదటి కేంద్ర లా అండ్ జస్టిస్ శాఖ మంత్రిగా సేవలు అందించారాని గుర్తు చేశారు. సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు ఉపేందర్ రెడ్డి, రాజేశ్వర్, డీఎస్సీడీవో విజయలక్ష్మి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ స్వప్న, ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ ఆస్పత్రిలో సూపర్ స్పెషాలిటీ క్రిటికల్ కేర్ విభాగం ఏర్పాటు చేయాలి

- **ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బ్రాహ్మణపెల్లి యుగంధర్**



మనబలగం, కరీంనగర్: ప్రభుత్వ ఆస్పత్రిలో సూపర్ స్పెషాలిటీ క్రిటికల్ కేర్ ఏర్పాటుచేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి యుగంధర్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా బ్రాహ్మణపల్లి యుగంధర్ మాట్లాడుతూ కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో సూపర్‌స్పెషాలిటీ క్రిటికల్ కేర్ వైద్యం లేకపోవడం మూలంగా సుదూర ప్రాంతాల నుంచి అత్యవసర చికిత్స కోసం వచ్చే రోగులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీంతో హైదరాబాద్, వరంగల్‌కు వెళ్లి వైద్యం చేయించుకోవాలని వైద్యులు చెప్పడంతో హుటాహుటిన వెళ్లిన రోగులు మార్గమధ్యలోనే ప్రాణాలు విడుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిరోజూ పదుల సంఖ్యలో ఆస్పత్రికి వస్తున్నారని, ఉమ్మడి జిల్లాకు ప్రధాన కేంద్రమైన కరీంనగర్‌లో వెంటనే రాష్ట్ర ప్రభుత్వం సూపర్‌స్పెషాలిటీ క్రిటికల్ కేర్ వైద్య సౌకర్యం అందించేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఉత్తర తెలంగాణకు తల మాణికంలా ఉన్న కరీంనగర్‌లో క్రిటికల్ కేర్ వైద్యం లేకపోవడం మూలంగా ప్రజలు నానా రకాల ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకోవాలని కోరారు.




# శాసనసభ ఆవరణలోని అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించిన విప్



ధర్మపురి, డిసెంబర్ 6 (మన బలగం): రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డా.బి.ఆర్. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌తో కలిసి శాసనసభ ఆవరణలోని విగ్రహానికి ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్, శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, ఎమ్మెల్సీ దయానంద్, లెజిస్లేటివ్ సెక్రటరీ డాక్టర్ వి.నరసింహాచార్యులు,అధికారులు పాల్గొన్నారు.

మన బలగం
సామాన్యుడి ఆయుధం
తెలుగు దినపత్రిక





### అంబరాన్నంటిన శ్రీకృష్ణుడి వివాహ వైభోగం

### పారుపెల్లి ఆశ్రమంలో వేడుకలు

### వేలాదిగా తరలివచ్చిన భక్తులు

# కల్యాణం.. కమనీయం..!

నిర్మల్, డిసెంబర్ 6 (మన బలగం): నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలంలోని పారుపెల్లి శ్రీకృష్ణ ఆశ్రమం భక్తజన సంద్రమైంది. ఆశ్రమం 29వ వార్షికోత్సవం అత్యంత వైభవం నిర్వహించారు. వేడుకలల్లో భాగంగా మూడో రోజు శుక్రవారం రుక్మిణీ సత్యభామ సహిత శ్రీకృష్ణుడి కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించేందుకు లక్ష్మణచాంద మండలంతోపాటు నిర్మల్ జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. వేదమంత్రోచ్ఛరణల మధ్య స్వామివారి కల్యాణం వైభవంగా జరిగింది. భక్తులు అంత్యంత భక్తిశ్రద్ధలతో స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు.











TELTEL/2024/12335, EMAIL : manabalagam.news@gmail.com / cell : 9441110002